క్లుప్తంగా

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు: ఎమ్మెల్యే గోపిరెడ్డి

నరసరావుపేట: ప్రజలకు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి శనివారం సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర మంతటా సంక్షేమంతో పాటు అభివృద్ధి వెలుగులు విరజిమ్మాలని చెప్పారు. ఈ పండగ తెలుగు ప్రజలందరికీ సుఖ సంతోషాలను, మంచి ఆరోగ్యాన్ని అందించాలని మనస్పూర్తిగా భగవంతుని ఆశీస్సులతో అందరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు.

సంక్రాంతి శుభాకాంక్షలు

వినుకొండ(నూజెండ్ల): ప్రజలకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు భోగి, మకర సంక్రాంతి, కనుమ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో భోగభాగ్యాలను, సుఖసంతోషాలను చేకూర్చాలని, నియోజకవర్గ ప్రజలందరూ పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం



నరసరావుపేట ఈస్ట్: ప్రకాష్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ బాలికల కళాశాల ఆధ్వర్యంలో వారం రోజులుగా యలయందలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం శనివారం ముగిసింది. ఈ సందర్భంగా గ్రామ పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ ఆంథోనిమేరి విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు. వారం రోజులుగా నిర్వహించిన శిబిరంలో స్వచ్ఛభారత్, ప్లాస్టిక్ నివారణ ర్యాలీ, ఉచిత వైద్య శిబిరం పేదలకు దుప్పట్లు, వస్త్రాలు పంపిణీ, బాల్యవివాహాలపై అవగాహన తదితర కార్యక్రమాలు చేపట్టినట్లు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ కొత్తపల్లి రాణి తెలిపారు.

రిపబ్లిక్ పరేడ్‌కు మేజర్ రాజు ఎంపిక



నరసరావుపేట ఈస్ట్: శ్రీసుబ్బరాయఅండ్ నారాయణ కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ బీఎస్ఆర్‌కే రాజు ఈ నెల 26వ తేదీన న్యూఢిల్లీలో నిర్వహించనున్న రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సోము మల్లయ్య శనివారం తెలిపారు. మేజర్ రాజుతో పాటుగా ఎన్‌సీసీ క్యాడెట్ కొండెబోయిన ఏడుకొండలు కూడా రిపబ్లిక్ పరేడ్‌కు ఎంపికైనట్లు చెప్పారు. ఉభయ తెలుగు రాష్ట్రాల ఎన్‌సీసీ డైరెక్టరేట్ నుంచి ఎన్‌సీసీ ఆఫీసర్ మేజర్ రాజు ఎంపిక కావడం కళాశాలకే గర్వకారణమన్నారు. పరేడ్‌కు ప్రాతినిధ్యం వహించనున్న 130 మంది ఎన్‌సీసీ క్యాడెట్‌లకు మేజర్ రాజు నాయకత్వం వహిస్తారని తెలిపారు. ఎంపిక కావటంపై కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయ్‌కుమార్, నాగసరపు సుబ్బరాయగుప్తా హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా భవ్యదంపతి పూజలు



వినుకొండ(నూజెండ్ల): ధనుర్మాసాన్ని పురస్కరించుకొని వినుకొండ పట్టణంలోని ఎన్ఎస్‌పీ కాలనీ గ్రౌండ్‌లో చిన్నజీయరు స్వామి నిలయం నిర్వాహకులు భవనాసి మల్లికార్జునప్రసాద్ దంపతుల ఆధ్వర్యంలో భవ్యదంపతి పూజలు అహోబిలం రామానుజ స్వామి ఆశీస్సులతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ లక్ష్మీదేవి అమ్మవారికి పసుపు పూజ చేశారు. పసుపును వచ్చిన భక్తులకు వాయినంగా స్వామి చేతుల మీదుగా అందజేశారు. లక్ష్మీనారాయణస్వామి ఆశీస్సులు భక్తులకు ఎల్లవేళలా ఉండాలని, అందరూ సుఖసంతోషాలతో ఉండాలనే ఉద్దేశంతో ఈ పూజా కార్యక్రమాలు చేశామని తెలిపారు. చిన్నారులు, మహిళల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

ఉచిత మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు



వినుకొండ(నూజెండ్ల): స్థానిక ఆర్టీసీ డిపోలో అసిస్టెంట్ మేనేజర్ (పి)గా విధులు నిర్వహించిన ముంద్రు విజయరాజకుమార్ జయంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులు బస్టాండ్‌లోని ప్రయాణికుల తాగునీటి సౌకర్యార్థం ఉచిత మినరల్ వాటర్‌ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. డిపో మేనేజర్ బి.కోటేశ్వరరావునాయక్ రిబ్బన్ కట్ చేసి ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం డీఎం మాట్లాడుతూ బస్టాండ్‌లో ప్రయాణికుల తాగునీటి సౌకర్యం కల్పించిన విజయరాజకుమార్ కుటుంబసభ్యులను అభినందించారు.



రాష్ట్ర యువజన విభాగం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సారథ్యంలో పట్టణంలో చేపట్టిన నియోజకవర్గ యూత్ మీట్ అండ్ గ్రీట్ కార్యక్రమం పార్టీ శ్రేణులు కోలాహలంగా నిర్వహించాయి. యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి దిశానిర్దేశం చేశారు. - నరసరావుపేట

ఘనంగా సంక్రాంతి సంబరాలు



దొండపాడులో వాలీబాల్ క్రీడాకారులతో నిర్వాహకులు



గణపవరం సీఆర్ కళాశాలలో భోగి మంటలు వేస్తున్న విద్యార్థులు

నరసరావుపేట రూరల్: మండలంలోని దొండపాడులో సంక్రాంతి సంబరాలు కోలాహలంగా ప్రారంభమయ్యాయి. శనివారం వాలీబాల్ పోటీలు నిర్వహించారు. పోటీలను నరసరావుపేటలోని లైఫ్‌లైన్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పేరం రాజనందరెడ్డి ప్రారంభించారు. మొత్తం ఐదు జట్లు పోటీల్లో పాల్గొంటున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలలోని విజేతలకు బహుమతులు అందించనున్నట్లు నిర్వాహకులు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి వెంకటేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

సీఆర్ కళాశాలలో..

నాదెండ్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఇప్పటికే విద్యాసంస్థలు, వాణిజ్య కార్యాలయాల్లో ముందస్తు వేడుకలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ఆది, సోమ, మంగళవారాల్లో రంగవల్లుల పోటీలు నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. గణపవరంలోని కోదండ రామాలయంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం భోగి మంటలు వేయనున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటూ మరో 10 మందికి కన్సొలేషన్ బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

లింగారావుపాలెంలో..

యడ్లపాడు: మండలంలోని లింగారావుపాలెంలో భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య(డీవైఎఫ్ఐ) 44వ సంక్రాంతి క్రీడా సంబరాలు శనివారం ప్రారంభమయ్యాయి. రన్నింగ్, క్రికెట్, వాలీబాల్, సైకిల్ స్లో, షటిల్, క్విజ్, వక్తృత్వం, వ్యాసరచన, కుండకొట్టుడు, మోకులాగుడు, రంగవల్లులు, మ్యూజికల్‌చైర్స్, ఫన్నీగేమ్స్ పోటీలు నిర్వహించనున్నారు. 14వ తేదీన మద్దుకూరి ఆర్ట్స్ క్రియేషన్స్ (చిలకలూరిపేట) వారిచే మద్దుకూరి రవీంద్రబాబు రచనకు వై.భవాని దర్శకత్వం వహించిన 'మృత్యుపత్రం' సాంఘిక నాటిక ప్రదర్శన, అలాగే ఉత్సవాలు చివరిరోజైన 15వ తేదీ రాత్రి పలు సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆయా కార్యక్రమాలను విజన్ ఫౌండేషన్, గ్రామ ఎన్ఆర్ఐ యువకులు, పెద్దలు సహకారంతో కొనసాగిస్తున్నట్లు చెప్పారు.

నేడు గోదా రంగనాయకులు కల్యాణ వేడుకలు



రంగనాయక దేవాలయంలో ఉత్సవ మూర్తులకు పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

యడ్లపాడు: ధనుర్మాసం ముగింపు సందర్భంగా గోదా రంగనాథుల కల్యాణ వేడుకలు నిర్వహించనున్నట్లు అర్చకులు పర్చూరి రామకృష్ణమాచార్యులు తెలిపారు. మండలంలోని సొలస గ్రామంలోని రంగనాయక స్వామి ఆలయంలో ధర్మకర్తలు అర్వపల్లి మనోహర్, నాగజ్యోతి, అర్వపల్లి సోదరులు నేతృత్వంలో ధనుర్మాసం ప్రారంభం నుంచి ప్రతిరోజు దేవతామూర్తులకు విశేష అలంకరణలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ధనుర్మాసం చివరి రోజైన ఆదివారం ఉదయం 9 గంటలకు భోగి పండ్ల స్నానం, 9.30 గంటలకు అమ్మవారికి సారేతో ఊరేగింపు, 10 గంటలకు గోదాదేవి, రంగనాయకస్వామి కల్యాణ వేడుకలు ఉంటాయన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఆయా కార్యక్రమాలను దేవస్థాన ఈఓ శివయ్య పర్యవేక్షించనున్నారు.

ఈవీఎం ఓటింగ్ యంత్ర పరికరాలపై అవగాహన

శావల్యాపురం: మండలంలోని శానంపూడిలో పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎం ఓటింగ్ యంత్ర పరికరాలపై ప్రజలకు ఇరు పార్టీల నాయకులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డెప్యూటీ తహసీల్దార్ పి.నాసరయ్య మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ యంత్ర పరికరాలపై ప్రజలకు అవగాహన కోసం అన్నీ గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి ఎం.శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ సీహెచ్ రంగారావు, ఏఎస్ఓ చెన్నయ్య, వీఆర్వో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు పూర్వ విద్యార్థుల సమావేశం

చిలకలూరిపేట: ఎస్‌సీవీఎస్ జూనియర్ కళాశాల, డీఆర్ఎన్ ఎస్‌సీవీఎస్ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సమావేశం ఆదివారం నిర్వహించనున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు తాళ్ల అంజిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్ ప్రాంగణంలో సమావేశం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు కొనసాగుతుందని చెప్పారు. కళాశాల ప్రారంభమైన 1974 నుంచి ఇప్పటి వరకు రెండు కళాశాలల్లో చదువుకున్న విద్యార్థులు అందరూ హాజరుకావాలని కోరారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

అ'పూర్వ' సమ్మేళనం



యడ్లపాడు లూథరన్ హైస్కూల్లో 1990-1995 మధ్య చదివిన విద్యార్థులు

యడ్లపాడు: పూర్వ విద్యార్థుల సమావేశం సందడిగా జరిగింది. మండల కేంద్రమైన యడ్లపాడు లూథరన్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఆత్మీక సమావేశం శనివారం నిర్వహించారు. 1990 –1995 మధ్య కాలంలో పాఠశాలలో ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకు అభ్యసించిన విద్యార్థులు 110 మంది హాజరయ్యారు. తమ జ్ఞాపకాలు ఒకరినొకరి పంచుకుని మురిసిపోయారు. అప్పటి గురువులను సత్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులంతా సరదాగా పలు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎంతో సంతోషంగా గడిపి ఆ మధురస్మృతుల్ని మోసుకెళ్లారు.

ధనుర్మాసం..దివ్య సమ్మోహనానందం



వడ్డవల్లిలో స్వర్ణ అలంకారంలో శ్రీవారు



పెద్దమక్కెనలో ప్రత్యేక అలంకరణలో శివలింగం

సత్తెనపల్లి: ధనుర్మాసం పురస్కరించుకొని పట్టణంలోని ఆలయాల్లో శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వడ్డవల్లి శ్రీ రామాలయం వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి స్వర్ణ, కోదండ రామస్వామికి శ్వేతవర్ణ అలంకరణలు గావించారు. రైల్వేస్టేషన్ రోడ్డులోని అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీవారికి దివ్య సమ్మోహనానంద రూప అలంకరణ గావించారు. ఐదులాంతర్ల సెంటరులోని రుక్మిణి సత్య భామ సమేత వేణుగోపాలస్వామి, కట్టమూరివారి వీధిలోని కోదండ రామాలయం, పెద్ద మక్కెన గంగా భ్రమరాంభ సమేత మల్లికార్జున స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయాల కమిటీలు ఏర్పాట్లను పర్యవేక్షించాయి.

వైఎస్సార్ సీపీ ఎన్నికల కార్యాలయం ప్రారంభం



దేవతామూర్తుల చిత్రపటాలతో కార్యాలయంలోకి వెళ్తున్న మల్లెల రాజేష్‌నాయుడు

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఎన్నికల కార్యాలయాన్ని శనివారం ప్రారంభించారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డు పక్కన బ్యాంకు కాలనీలో ఏర్పాటు చేసిన కార్యాలయాన్ని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు ప్రారంభించారు.

జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు...

ఎన్నికల కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా మల్లెల రాజేష్‌నాయుడు మాట్లాడుతూ జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు జరుగుతోందని... రాష్ట్రంలో తిరిగి రాబోయేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని చెప్పారు. కుల, మత, వర్గ విభేదాలు లేకుండా జగనన్న అడుగు జాడలలో నడుస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. ప్రతి కుటుంబంలో అన్నలా, తమ్ముడిలా, కొడుకులా ఉంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, పార్టీ మండలాల అధ్యక్షులు, మున్సిపల్ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, సొసైటీ చైర్మన్లు, జేసీఎస్ కన్వీనర్లు, పార్టీ వివిధ విభాగాల నాయకులు, ప్రజా ప్రతినిధులు తరలివచ్చి కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొని మల్లెల రాజేష్‌నాయుడుకు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజలకు అండగా ఉంటా

నాదెండ్ల: నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని వచ్చే సాధారణ ఎన్నికల్లో తనను ఆశీర్వదించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు చెప్పారు. గణపవరంలో పార్టీ నాయకులు, కార్యకర్తల సమావేశం శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధిలో దూసుకెళ్తున్నారని చెప్పారు. మన ప్రభుత్వంలో ఏ కుటుంబానికైనా న్యాయం జరిగితేనే ఓటేయాలని చెప్పిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో భారతదేశంలోనే ఎక్కడా లేనన్ని పథకాలు మన రాష్ట్రంలో అమలులో ఉన్నాయని వివరించారు. ముఖ్యంగా విద్య, వైద్యానికి భారీగా నిధులు ఖర్చు పెట్టి ఎనలేని కృషి చేశారన్నారు. చిలకలూరిపేటలో పుట్టి పెరిగానని, తన తాత, తండ్రి పేట రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండి ప్రజలకు విశేషమైన సేవలందించారని చెప్పారు. మల్లెల ఫౌండేషన్ ద్వారా ఇప్పటికీ ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు తులం సుధాకర్, ఆదంవలి, పిల్లి సాగర్‌బాబు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కాట్రు రమేష్, మాజీ సర్పంచ్ కెల్లంపల్లి సుందరరావు, గాలి బుచ్చయ్య, రహంతుల్లా, సుబ్బారావు, కొండెపాటి నాగయ్య, శంకరరెడ్డి, సుబ్రహ్మణ్యం, ఆంజనేయులు, కోటేశ్వరరావు, కాటా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పేదలకు నిత్యావసరాలు పంపిణీ

నాదెండ్ల: సంక్రాంతిని పురస్కరించుకుని పేదలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. గణపవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు కెల్లంపల్లి అచ్చయ్య మాతృమూర్తి సుబ్బమ్మ జ్ఞాపకార్థం సుమారు 20 మంది పేద కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు.

సంక్రాంతి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలి

నాదెండ్ల: సంక్రాంతిని సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని ఎస్ఐ జె.బలరామ్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూదం, అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో మహిళలకు ముగ్గుల పోటీలు, యువకులకు కబడ్డీ, గాలిపటాలు వంటి పోటీలు నిర్వహించుకోవాలన్నారు. ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

సెల్‌ఫోను అందజేత

శావల్యాపురం: మండలంలోని శానంపూడి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త చెందిన సెల్‌ఫోను గత ఏడాది పోగొట్టుకుంది. ఈక్రమంలో స్థానిక పోలీసు స్టేషనులో ఫిర్యాదు చేసింది. సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ప్రభుత్వం అందజేసిన శ్యాంసాంగ్ సెల్‌ఫోనును శనివారం స్వాధీనం చేసుకుని, బాధితురాలికి అందజేసినట్లు ఎస్ఐ తుళ్ళూరి తిరుపతిరావు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో శ్రీకృష్ణుడికి పూజలు

సత్తెనపల్లి: ధనుర్మాసాన్ని పురస్కరించుకొని పట్టణంలోని గార్లపాడు బస్టాప్ సెంటర్‌లో గల గీతా మందిరంలో శనివారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుడిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు నిర్వహించారు. స్వామి వారికి 108 గిన్నెలో నైవేద్యం సమర్పించారు.

మాదల పీఏసీఎస్ అధ్యక్షుడిగా అయ్యప్ప

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల పీఏసీఎస్ అధ్యక్షుడిగా మాదల గ్రామానికి చెందిన తిరుమలశెట్టి అయ్యప్ప నియమితులయ్యారు. వీరితో పాటుగా బొల్లవరానికి చెందిన కంది రామిరెడ్డి, ఇరుకుపాలేనికి చెందిన బత్తుల వెంకటేశ్వర్లు సభ్యులుగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన రాష్ట్ర జల వనరులశాఖ మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సహకార సంఘాల ద్వారా రైతులకు అందించే అన్ని రకాల ప్రోత్సాహకాలను అందించేందుకు తనవంతు కృషి చేస్తానని అయ్యప్ప చెప్పారు. అయ్యప్పను గ్రామస్తులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అభినందించారు.

సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులకు ఆర్థిక సాయం

క్రోసూరు: సమగ్ర శిక్షలో పని చేస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు మండల ఉపాధ్యాయులు శనివారం ఆర్థిక సాయం అందజేశారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో ఉపాధ్యాయుల తరపున రూ.70,500లు ఎంఈఓ ఏకుల ప్రసాదరావు అందించారు. ఈ కార్యక్రమంలో మండల ఫ్యాప్టో నాయకులు పాల్గొన్నారు.

కుంటలో పడి యువకుడు గల్లంతు

అమరావతి: ఎండ్రాయి గ్రామ పరిధిలోని కుంటలో పడి యువకుడు గల్లంతైన ఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తుల వివరాల మేరకు.. మాచర్ల మండలం కొత్తూరు గ్రామానికి చెందిన జానపాటి వీరాంజి గొర్రెలు మేపుకోవటానికి పది రోజుల క్రితం మందతో ఎండ్రాయి కొండ దగ్గరకు చేరుకున్నాడు. ప్రతి రోజు మేతమేసిన గొర్రెలకు కుంటలో నీరు తాగిస్తుంటాడు. ఈ క్రమంలో అక్కడికి వెళ్లిన వీరాంజి ప్రమాదవ శాత్తు కుంటలో పడి, మునిగిపోయాడు. ఈ విషయమై గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఈతగాళ్ల సాయంతో గాలింపు చర్యలు చేపట్టారు. అయితే యువకుడి ఆచూకి లభించలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో ఇష్టారాజ్యంగా కొండ మట్టి తవ్వకాలు జరపడంతో.. భారీ కుంటలు ఏర్పడ్డాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ప్రభుత్వ వైద్యశాల కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట: స్థానిక ప్రభుత్వ వైద్యశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా డాక్టర్ కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి నియమితులైనట్లు వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మంత్రూనాయక్ శనివారం తెలిపారు. ఇప్పటి వరకు పనిచేసిన డాక్టర్ ఓరుగంటి శేషిరెడ్డి రాజీనామా చేయటంతో శ్రీనివాసరెడ్డిని నియమించినట్లు వివరించారు. మిగతా కార్యవర్గంలో ఎటువంటి మార్పులు లేవని పేర్కొన్నారు. కాగా, శ్రీనివాసరెడ్డి నియామకంపై ఐఎంఏకు చెందిన పలువురు డాక్టర్లు హర్షం వ్యక్తం చేశారు.

రేపు దింతెనపాడు చరిత్ర పుస్తకం ఆవిష్కరణ

యడ్లపాడు: మకర సంక్రాంతి పర్వదినాన మండలంలోని దింతెనపాడు గ్రామ చరిత్ర గ్రంథాన్ని ఆవిష్కరించనున్నట్లు గ్రంథ రచయిత, హేతువాద సంఘ జాతీయ కార్యదర్శి మేడూరి సత్యనారాయణ శనివారం తెలిపారు. పదో శతాబ్దపు భద్రకాళి, జంటసర్పాలు, పోతురాజు, వీరగల్లు, 11వ శతాబ్దపు దండేశ్వరస్వామి, చెన్నమల్లేశ్వరస్వామి శైవవైష్ణవ పురాతన ఆలయాలు తదితర గ్రామం యొక్క వెయ్యేళ్ల చరిత్రను ఇందులో పొందుపరిచామన్నారు. అగ్రహారం నుంచి గ్రామం ఆవిర్భమైన అన్ని వివరాలను భావితరాలకు తెలియజేయాలనే సంకల్పంతో వెలువరించినట్లు చెప్పారు. సోమవారం ఉదయం 10 గంటలకు ఏఎన్‌యూ విశ్రాంత రిజిస్ట్రార్ రావెల సాంబశివరావు దీనిని ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో చరిత్ర, శాసన పరిశోధకులు అద్దంకి గ్రామానికి చెందిన జ్యోతి చంద్రమౌళి, సినీ, టీవీ నటులు డాక్టర్ చిట్టినేని లక్ష్మీనారాయణ, కవిరాజు సాహితీ సమితి అధ్యక్షులు ఆలోకం పెద్దబ్బయ్య పాల్గొంటారని చెప్పారు.

రూ.19 లక్షల నిధులతో అభివృద్ధి పనులు

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో ఉపాధి నిధులు రూ.17 లక్షలతో నూతనంగా సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు పంచాయతీ రాజ్ ఏఈ ఎ.వెంకటేశ్వరస్వామి శనివారం తెలిపారు. పనులు శనివారం పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గ్రామంలోని ఎస్సీ కాలనీలో 100 మీటర్ల మిగిలిన 220 మీటర్ల వివిధ ఏరియాలో రోడ్డు పనులు పారదర్శకంగా చేస్తున్నట్లు వివరించారు. అలాగే శావల్యాపురం పోలీసు స్టేషను సమీపంలో బీసీ కాలనీలో పంచాయతీ నిధులు రూ. 2 లక్షలతో సీసీ డ్రైన్స్ నిర్మాణ 60 మీటర్ల మొర ప్రారంభించామన్నారు. ఆయనతో పాటు సర్పంచులు యలగాల బసవయ్య, యాగసిరి చెన్నమ్మ, సచివాలయ ఇంజినీరు సహాయకులు బసవరాజు పాల్గొన్నారు.